మానుకోట మానిని

గిరిజనుల ముద్దుబిడ్డ

తండ్రి వారసత్వంగా రాజకీయ రంగ ప్రవేశం

తొలి ప్రయత్నంలోనే విజయం... అసెంబ్లీలో అడుగు

లోకసభకు ఎన్నికైన తొలి లంబాడ మహిళగా రికార్డు

ఆమెది సునాయస రాజకీయ ప్రస్థానం. తండ్రి వారసత్వంగా పొలిటికల్ ఎంట్రీ. కలిసొచ్చిన అవకాశాలు. ప్రజలకు పరిచయం లేకుండానే రాజకీయ రంగ ప్రవేశం. కాంగ్రెస్ పార్టీ నుంచి 2009 ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేసే ఛాన్స్. తొలి ప్రయత్నంలోనే విజయం. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి లంబాడ మహిళగా అసెంబ్లీలో అడుగు. వరసగా రెండోసారి కాంగ్రెస్ పార్టీ నుంచి శాసనసభకు పోటీ చేసి పరాజయం. ఆ తర్వాత రాజకీయ దిగ్గజమైన తండ్రితో కలిసి బీఆర్ఎస్ లో చేరిక. గులాబీ పార్టీలో కీలక పాత్ర. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం. లోకసభ ఎన్నికల్లోనూ తొలి ప్రయత్నంలోనే విజయకేతనం. పార్లమెంటు సభ్యురాలిగా ఎన్నికైన తొలి లంబాడ మహిళగా రికార్డు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి పార్లమెంటు ఎన్నికల బరిలో. ఒకసారి కాంగ్రెస్ హవా.. రెండోసారి బీఆర్ఎస్ హవాలో సులువుగా విజయాలను తన ఖాతాలో వేసుకున్న ఆమెకు ఇప్పుడు గెలుపు సవాల్ గా మారింది. ఆమే మహబూబాబాద్ పార్లమెంటు సభ్యురాలు మాలోతు కవిత. మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి తాజాగా బీఆర్ఎస్ అభ్యర్థినిగా మహబూబాబాద్ లోకసభ స్థానం నుంచి బరిలో నిలిచారు. తన ప్రతిభతో దూసుకెళ్తున్న గిరిజన మహిళగా కవిత రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తున్నారు. అందరితో కలివిడిగా ఉండే ఆమె ఇట్టే దూసుకుపోతారు. చిరునవ్వుతో పలకరించే తత్వం, ఆకట్టుకునే వాక్చాతుర్యం మాలోతు స్పెషల్. చిన్ననాటి స్నేహితురాలు హరిత ఆమె అదనపు బలం. ప్రజలను బాబాయి, మామయ్య అంటూ వరుసలు పెట్టి పిలవడం ఆమె నైజం. ఆమె నాయకత్వ పటిమను గుర్తించిన కేసీఆర్ మానుకోట జిల్లా పార్టీ పగ్గాలు అప్పగించారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల బరిలో బిజీగా ఉన్న మాలోతు కవితపై 'అక్షర దర్బార్' ప్రత్యేక కథనం...

- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

- చిరునవ్వుతో పలకరించే తత్వం.. ఆకట్టుకునే వాక్చాతుర్యం
- ప్రజలను బాబాయి, మామయ్య అంటూ వరసలతో పలకరింపు
- చిన్ననాటి స్నేహితురాలు హరిత అదనపు బలం
- వరంగల్ నగరంలో విద్యాభ్యాసం
- రెండోసారి పార్లమెంటు ఎన్నికల బరిలో
- మారిన సమీకరణలతో సవాల్ గా మారిన గెలుపు
- మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవితపై 'అక్షరదర్బార్' స్పెషల్ స్టోరీ

తనదైన శైలిలో ప్రచారం..

ఆమె తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. అందరిని ఆప్యాయంగా పలకరించి దగ్గరకు తీసుకుంటారు. తన వాక్చాతుర్యంతో అందరిని ఆకట్టుకుంటుంది. ఎప్పుడు ఆమె ముఖంలో చిరునవ్వు చెరగనివ్వదు. ప్రేమ స్వభావం గల ఆమె అన్న, అక్క, బాబాయ్, మామయ్య అని వరుసలు పెట్టి పిలుస్తూ అందరి ఆధరాభిమానాలు చూరగొంటున్నారు. నిలువెత్తు రాజసం గల అభిమాన నాయకురాలిగా పేరు గడించారు. గతంలో జరిగిన బహిరంగ సభలో కేసీఆర్ తన కూతురును గెలిపించాలని కవితను ఉద్దేశించి సంబోదించడాన్ని మహబూబాబాద్ ప్రజలు ఎప్పటికి మరిచిపోరు. 2019 ఎన్నికల ప్రచారంలో సమ్మక సరాలమ్మ జాతీయ హోదా, బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు అనే నినాదంతో ముందుకు వెళ్లి భారీ మెజారిటీ తో ఘన విజయం సొంతం చేసుకున్నారు. బీజేపీ విభజన హామీలు అమలు చేయడం లేదని ప్రచారం చేస్తున్నారు.

అనతి కాలంలోనే తన మార్క్

తండ్రి నుంచి వారసత్వంగా రాజకీయాల్లో వచ్చినా అనతి కాలంలో తనదైన మార్క్ చూపించారు. నియోజకవర్గంలో అందరి అడబిడ్డగా మన్నలను పొందారు. ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్య విని వెంటనే పరిష్కరించడం ఆమె నైజాం. ఆపద అని వస్తే ఏ సమయంలోనైనా స్పందించి ఆదుకుంటుందని కవితకు మంచి పేరుంది. పాలనలో తనదైన శైలిని ప్రదర్శించి తండ్రిని మించిన తనయగా పేరు సంపాదించారు. ఎంపీగా మొదటి సారి ప్రమాణాస్వీకారోత్సవంలో జై బంజారా అని నినదించిన మొదటి వ్యక్తి. కరోనా కష్ట కాలంలో పార్లమెంట్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి భేష్ అనిపించుకున్నారు. మల్టీ విటమిన్ టాబ్లెట్లు, పండ్ల రసాలు అందించారు. అటవీ, ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించి పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ఆదుకున్నారు. భారీ వర్షాలకు వరదలు వచ్చినప్పుడు ములుగు, ఏటూరునాగారం, భద్రాచలం వరద ముంపు గ్రామాల్లో పర్యటించి వరద బాధితులకు తనవంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎటువంటి వివాదాలు లేని నాయకురాలిగా, జనం మెచ్చిన నేతగా తక్కువ కాలంలో గుర్తింపు తెచ్చుకున్నారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు ఆరోగ్య పరమైన సమస్యలు వచ్చినా, ఆపదలో ఉన్నా 24 గంటలు అందుబాటులో ఉంటారనే పేరుంది. అర్ధరాత్రి అయినా సరే స్పందిస్తారు, అవసరమైతే తానే నేరుగా హాస్పిటల్ కి వెళ్లి మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తారు.

అందివచ్చిన అవకాశాలు

రాజకీయ ఆరంగ్రేటం చేసినప్పటి నుంచి కవిత తనకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. 2008లో ఆమె తండ్రి ధరంసోతు రెడ్యానాయక్ వారసత్వాన్ని అందిపుచ్చుకొని రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆ సమయంలో రెడ్యానాయక్ కాంగ్రెస్ పార్టీలో కీలక భూమిక పోషించారు. కవిత పొలిటికల్ ఎంట్రీ సునాయసమైంది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి హవా రాష్ట్రంలో కొనసాగుతున్న రోజులు. నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో మహబూబాబాద్ జనరల్ కేటగిరి నుంచి ఎస్టీ రిజర్వుడ్ స్థానంగా మారింది. దీంతో అదే సమయంలో కాంగ్రెస్ లో చేరిన మాలోతు కవితకు తండ్రి సహకారంతో మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థినిగా శాసనసభకు పోటీచేసే అవకాశం లభించింది. ఇదే ఎన్నికల్లో తండ్రి రెడ్యానాయక్ డోర్నకల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. తండ్రి ఓటమి చెందగా, ఆమె తొలి ప్రయత్నంలోనే గెలుపొంది అందరి దృష్టిని ఆకర్షించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కవిత వరుసగా రెండోసారి మహబూబాబాద్ నుంచి, ఆమె తండ్రి రెడ్యానాయక్ డోర్నకల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో దిగారు. ఈసారి తండ్రి గెలుపొందగా, కూతురు కవిత పరాజయం పాలయ్యారు. ఇలా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన తండ్రీ కూతుర్లలో ఒకసారి కూతురు గెలవగా తండ్రి ఓడిపోవడం, మరోసారి తండ్రి గెలవగా కూతురు ఓడిపోవడం ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ జరిగింది.

కుటుంబ నేపథ్యం

మాలోతు కవిత 1980 జనవరి 1వ తేదీన డోర్నకల్ నియోజకవర్గం చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామంలో జన్మించారు. తండ్రి ధరంసోత్ రెడ్యానాయక్ తల్లి లక్ష్మీ. సోదరులు రవిచంద్ర, రాజేంద్రప్రసాద్. భర్త భద్రునాయక్, కూతురు మహతి, కుమారుడు నయన్ ఉన్నారు. కవిత వరంగల్ లోని ఫాతిమా స్కూల్ లో 1నుంచి 10వ తరగతి వరకు చదివారు. ఆమె మెట్టినిల్లు ఇల్లందు నియోజకవర్గం గార్ల మండలం సీతంపేట గ్రామం. కవిత తన చిన్ననాటి స్నేహితురాలైన హరితమ్మను ఎప్పుడు విడిచిపెట్టదు. బాల్యం నుండి ఇప్పటి వరకు ప్రతి విషయంలో తోడుగా ఉంటున్నారు. వీరిది ఒకే ఆత్మ రెండు శరీరాలు అని నియోజకవర్గ ప్రజలు చెప్పుకుంటారు.

కాంగ్రెస్ వీడి కారెక్కి...

ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2014 నవంబర్ లో తండ్రీ కూతుర్లు కాంగ్రెస్ వీడారు. అప్పటి టీఆర్ఎస్ ఇప్పటి బీఆర్ఎస్ లో మాలోతు కవిత తన తండ్రి రెడ్యానాయక్ తో కలిసి చేరారు. కారు ఎక్కిన తర్వాత రెడ్యానాయక్, కవిత గానీ బీఆర్ఎస్ లో ప్రధాన భూమిక వహించారు. ఆమె తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. పలు ఎన్నికల్లో ఇన్ ఛార్జి గా ఉండి అయా ప్రాంతాల అభ్యర్థులు గెలవడంలో కవిత కృషి చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రెడ్యానాయక్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఆయన బీఆర్ఎస్ నుంచి అసెంబ్లీకి పోటీచేయడం మొదటిసారి. తండ్రి రెడ్యానాయక్ గెలుపులో కవిత కీలక పాత్ర పోషించారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి కవిత బీఆర్ఎస్ అభ్యర్థిత్వం దక్కింది. అప్పట్లో ఈ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో మెజార్టీ నియోజకవర్గాలు బీఆర్ఎస్ ఖాతాలో ఉండటం, బీఆర్ఎస్ హవా కొనసాగడం వల్ల కవిత గెలుపు సునాయసమైంది. పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసిన తొలిసారే విజయబావుట ఎగురవేసిన కవిత దేశంలో పార్లమెంటుకు ఎన్నికైన తొలి లంబడా మహిళగా రికార్డు నమోదు చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో కూడా ఆమె కీలకమయ్యారు. బీఆర్ఎస్ అదినేత కేసీఆర్ ఆమెకు మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. నాయకత్వపటిమ గల నేతగా ఆమె పార్టీలో రాణిస్తున్నారు.

ఈసారి గెలుపు సవాల్

2009 అసెంబ్లీ, 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఇట్టే గెలిచిన ఆమెకు ప్రస్తుత 2024 ఎంపీ ఎన్నికలు సవాల్ గా మారాయి. కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన తెల్లం వెంకట్రావ్ కూడా ఇటీవల కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో ఈ పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. తండ్రి రెడ్యానాయక్ కూడా కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ నుంచి ఓడిపోయారు. దీంతో ఆమె ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మాజీ ఎమ్మెల్యేల్లో కూడా అందరు మనస్ఫూర్తిగా పనిచేస్తేనే కవిత గెలుపుపై ఆశలు. తాజాగా మాజీ ఎమ్మెల్యేల వైపు నుంచి కూడా బీఆర్ఎస్ లో విభేదాలు ఉన్నట్లు బయటపడుతున్న పరిస్థితి. దీనికి తోడు రాజకీయ సమీకరణాలు కూడా మారిపోయాయి. ఈ నేపథ్యంలో రెండో సారి లోకసభ ఎన్నికల్లో గెలుపు మాలోతు కవితకు సవాల్ గా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.